

# నాకు నచ్చిన నా కథ

నేను, రాసిన కథలలో నాకీ కథ చాలా ఇష్టం.

సామాన్యంగా కథ ముగించేక టైటిల్ ఇవ్వడం నాకు అలవాటు. ఎందుకంటే, కథరాసేటప్పుడు అనుకోని మార్పులు జరగడం, చివరికి, రాసిన కథ అనుకున్న దానికన్నా భిన్నంగా ఉండడం, తరుచు జరుగుతూ ఉంటుంది. ఎన్నుకున్న పాత్రలు రచయిత ఉద్దేశాల మీద తిరుగుబాటు చెయ్యడాన్ని ఇలాగ జరుగుతూ ఉంటుంది.

కాని, నా మామూలు పద్ధతికి విరుద్ధంగా, ఈ టైటిల్‌కి సరిపడే కథ రాయాలని అనిపించింది. అందరూ 'సత్యంపద' అంటారు. అది లోకానికి సూత్రంగా అంగీకారం. కాని, నిజం చెప్పడంలో రకరకాల ఇబ్బందులు ఉన్నాయి. అదీ అందరికీ తెలుసును. నా చిన్న నవల 'గులాబిముళ్ళు' ఇలాటి ఇబ్బందులని దృష్టిలో పెట్టుకుని, భావోద్వేగాలని ఆధారం చేసుకుని రాసిన బరువైన ప్రేమ కథ. 'నిజం చెప్పి చూడు' అదే థీమ్‌ని తేలిగ్గా ఉండేలాగ మలిచి, కథానికగా రాసిన ప్రయత్న ఫలితం.

ఇందులో హీరో అబద్ధం చెప్పినంతసేపు హాయిగానే ఉంటాడు. కాని, అమాయికపు నిజం చెప్పడంతోనే అల్లరిపడతాడు. అతని అబద్ధాలూ, నిజాలూ కూడా నమ్మని రాజ్యం ఒక వ్యక్తి. అలాటివాళ్లు స్త్రీలలోనూ పురుషులలోనూ ఉంటారు. ఆమెకి నమ్మిక లేకపోవడానికి కారణాలు కథ మొదట ఉత్తమ పురుషలో చెప్పిన 'కమెంటరీ'లో కొంతవరకూ చెప్పేను. మిగిలినవీ ఆ పరిస్థితులనించి వొచ్చినవే. కథలో హీరో ఆకర్షణీయమైన రూపం, శక్తి సామర్థ్యాలు ఉన్నవాడు. అలాటి సహజ సంపద లేకపోయినా, సామాన్యమైన రూపం ఉన్న హీరోయిన్ వెనక చాలా ఆస్తిపాస్తులు ఉన్నాయి. ఈ పరిస్థితులలో నించే పాత్రల స్వభావాలు మలచడం జరిగింది.

అంతంలేని ఆమె; తనకి తనే 'మంచి' మనిషిగా మారిన అతను.... ఈ కథ రాయడంలో నాకు చాలా సంతృప్తిని కలుగజేశారు. రెండు మూడు ఇతర భాషల్లో వొచ్చిన ఈ కథ నాకు అందుకే నచ్చింది. పాఠకులకు కూడా నచ్చుతుందని ఆశిస్తూ,

భవదీయుడు

ఇ. జగన్నాథరావు

# నిజం చెప్పి చూడు

ప్రతి మనిషికీ జీవితంలో ఒక్కసారైనా అతి విషమ పరిస్థితి సంభవిస్తూ ఉంటుంది. నాలాటివాడికి ఇలాటి పరిస్థితులు చాలాసార్లు సంభవిస్తూ ఉంటాయి. దీనికి నా జాతకం గాని, నక్షత్రాల, గ్రహాల కదలికలుగాని కారణం అని అన్న నేను తరచు ఓదార్చుకున్నా, నిజమైన కారణం ఇదేమీ కాదనీ, నాలో ఉన్న దౌర్బల్యం అనీ పరిస్థితులు మరీ విషమించినప్పుడు తాత్కాలికంగా అంగీకరిస్తూనే ఉంటాను.

విషమ పరిస్థితుల్ని యుక్తితో ఎదురుకొని, అభిమానం రక్షించుకొని, మనో జ్ఞాపకపు బరువుతో ముందుకి సాగిపోవడాన్ని తెలివితేటలు అంటారు. జీవితంలో ఒకటో, రెండో పర్యాయాలు ఇలాగ తప్పించుకొని ముందుకి పోయేవాడు తెలివైనవాడు.

ఇది అలవాటయిపోయింది నాకు!

ప్రస్తుతం నా సమస్య రాజ్యం. అయిదడుగుల మూడంగుళాల ఎత్తు (అనుకుంటాను—నా ఎత్తునుబట్టి అడుగులూ అంగుళాల్లోనే నిశ్చయం లేదు. సెంటీమీటర్లలో ఎలాగ చెప్పగలను? అయినా, భర్తలకి భార్యల ఎత్తు, బరువు మొదలైన 'వైటల్' స్టాట్స్ తెలియకపోయినా వాళ్ళ సంపూర్ణ మనస్తత్త్వం తెలిసిపోయినట్టు ప్రవర్తిస్తారు). రీగల్ సినిమాలో ఉన్న ఆటోమాటిక్ మెషిన్ ప్రకారం నలభై ఎనిమిది కిలోల బరువు (ఈ సంగతి నిశ్చయంగా కరెక్టు—అంటే, నాలుగు నెలల క్రిందట: ఆ కార్డు నేను భద్రపరిచాను....దాని వెనకాల "నీ భాగస్వామి జీవితంలో ఒక సంఘటన నీ జీవితంలో చిన్న తుఫాను తెస్తుంది" అని ఇంగ్లీషు, హిందీ లేక మరాఠీలో అచ్చు వేశారు. ఈ పాటికి రాజ్యం ఏభై కిలోలు దాటి ఉంటుంది).

మనిషికి వచ్చే కష్టాల్లో, సమస్యల్లో రెండే ముఖ్యమైన పాత్రలు ఉంటాయి ఇవి కామిని, కాంచనం. కామిని అనే మాట పిశాచాలని జ్ఞాపకం తెచ్చినా, చాలా కాలం నించి ప్రాసకోసమేకాక, ఈ కారణంవల్ల కూడా పెద్దలు వాడుతూ వచ్చారు. ప్రస్తుతం ఇది చాలా యుక్తంగా ఉంది—ఆడవాళ్లు కేవలం తేనే, పాలు, పంచదారలతోనే తయారయ్యారని నమ్మే పరిస్థితిలో లేదు నా జీవితం. వాళ్లు పీడిస్తూనే ఉన్నారు.

రాజ్యం నేను ప్రేమించి, కలల్లో చూసి, వేడి నిట్టూర్పులు విడిచే అమ్మాయి కాదు—ఆమె నా భార్య. ప్రేమించడానికీ, కలలు కనడానికీ, తియ్యటి నిట్టూర్పులు విడవడానికీ అలవాటుపడ్డా, రాజ్యం విషయంలో ఇవేమీ జరగలేదు. యూనివర్సిటీ వదిలిపెట్టి, ఉద్యోగంలో చేరి, బొంబాయిలో నాలుగేళ్లు ఉద్యోగం చేశాక నా ఆదర్శాలు చాలా వరకు మారాయి. దీన్నే మానసిక వికాసం అంటారను కుంటాను. ఎమ్. ఎ. చదివే రోజుల్లో (అదీ అర్థిక శాస్త్రం) ప్రేమించి పెళ్లి చేసుకోవాలనీ, కట్నం తీసుకోకూడదనీ, ఒకరికి తల అమ్ముకోకూడదనీ—ఇలాగ చాలా ఆదర్శాల మాటలు కట్టాను. నాలుగేళ్లు బొంబాయిలో ఉద్యోగం చేస్తూ జీవించాక ఈ ఆదర్శాలు అంధేరీ చర్చ్‌గేట్ ఎలెక్ట్రిక్ రైళ్లలోనూ, జూలై వర్షాల్లోనూ, లంచి టైములోనూ చాలావరకు హరించిపోయాయి.

అందుకే రాజ్యం భార్యగా రావటం ఒక గొప్ప అదృష్టంగా భావించాను. ఆమె సౌందర్యవతి కాకపోయినా, నా కళ్లకి చాలా అందంగా కనిపించింది. కిట్టనివాళ్లు ఆ అందం వాళ్ల నాన్నగారి బాంకుల్లో షేర్ సర్టిఫికెట్లలో, దొంగ బంగారంలో నిండిన లక్ష్మిది అంటారు. ఒకరిద్దరు నాతో అని చూశారు కూడా.... కాని, నవ్వి సంభాషణ మరో విషయం మీదికి మార్చేశాను. నిజానికి రాజ్యాన్ని చూశాక నాకు అనిపించింది—ధనవంతుడి ఏకైక పుత్రిక అయినంతమాత్రాన పాపం, ఆ అమ్మాయి తప్పేముంది? ఆమెకీ, నాకూ అంగీకారం అయాక ఎందుకు పెళ్లిచేసుకోకూడదు? అని. అదీకాక ఆమె ఎమ్.ఎ. పాసయింది. అందుకే నేను ఎన్ని ఆదర్శాలు ఎక్కడ గాలిలో, ఇరకాటంలో, వర్షంలో వదిలేసినా, కట్నం తీసుకోలేదు—ఆ విషయం ముందరే షరతు పెట్టాను. నిజంగా పెళ్లి సమయంలో ఒక్క రూపాయి (పూర్వం దమ్మిడీ, తరవాత నయాపైసా, పైసా అనేవారు. ప్రస్తుతం రూపాయి అనడం సరిఅయినదని ఆర్థిక శాస్త్రవేత్తల అభిప్రాయం) తీసుకోలేదు. రాజ్యంతో మూడు బాంకుల్లో జాయింట్ అకౌంట్లూ, మెరీన్ డ్రైవ్‌లో ఫ్లాటూ, కారూ ఇవన్నీ నేను వద్దంటున్నా వాళ్లు బలవంత

పెట్టడం మూలాన, వాళ్ల సంతోషం కోసం స్వీకరించాను గాని, ఆదర్శాలు లేకకాదు.

ఈ పరిస్థితుల్లో నా జీవితం చాలా బాగా, హాయిగా సాగిపోవాలి. కాని, గులాబిని సృజించిన దైవం దానిచుట్టూ ముళ్లు పెట్టాడు. రాజ్యం గులాబికన్నా బాగుంటుంది అనుకున్న నాకు మొదటివారం సంసారంలో గడిచాక మొదటి సందేహం కలిగింది.

పూర్వాశ్రమంలో కొంతవరకూ జీవితం అన్ని రంగులలోనూ అనుభవించిన మనిషిని-నిజానికి ఆ అనుభవమే మరీ అందంగా ఉన్న అమ్మాయిని పెళ్లి చేసుకోకూడదనే నిర్ణయానికి నన్ను తెచ్చింది. రాజ్యం- ముందరే చెప్పాను- అంత సౌందర్యవతి కాదని. నిజానికి నేను చెప్పగలగేదంతా, ఆమెలో గమనించదగిన ఏ పెద్ద లోపమూ లేదని. అందుకే సంతోషంగా ఆమెని పెళ్లి చేసుకోగలిగాను.

ఆరోజు శనివారం. డిన్నర్‌కి బ్లూనైల్‌కి వెళ్ళాము- నేనూ, రాజ్యమూను. నాకు సాయంత్రం ఏదో పనిఉండి, ఆలస్యంగా రావడం వలన కాబరే టైముకి ఇంటికి వచ్చేలాగ చేరలేదు హోటలుకి. పది దాటాక చేరాము. ముందర ఒక కథాకళి, చిన్న మేజిక్ షో రాజ్యానికి చాలా నచ్చాయి. తరవాత ఆమెని తొందరపెట్టినా, ఫలితం లేకపోయింది. కాబరే ప్రారంభించడమూ, నూటికి తొంభైపాళ్ల నగ్నత్వంతో ఆ అమ్మాయి వచ్చి నా కళ్లజోడు తీసుకుని, వెనకనించి కౌగిలించుకుని చెవిలో గుసగుసలాడినట్లు నటించి సాగిపోవడమూ జరిగాయి.

ఈ చేష్టల్లో- కోపగించుకోవలసింది గాని, ఉత్సాహపడవలసిందిగాని ఏమీ లేదని నాకు తెలుసు. కాని రాజ్యం అనుభవం లేక చాలా చిరాకుపడింది.

అయిదు నిమిషాల నిశ్శబ్దం తరవాత నాకు ఒళ్ళు మండడం ప్రారంభించింది. "చూడు, రాజ్యం!" అన్నాను. భారతదేశంలో అత్యాధునికమైన ఈ పట్టణంలో నాగరికత ఎలా ఉండేదీ, ఈ రకం ఆడవాళ్ళు డబ్బుకోసం ఎలాగ ప్రవర్తించేదీ, అత్యున్నతమైన జీవితంలో (నాలాటివాళ్ళ) ఇది ఎలాగ పట్టించుకోనిదీ లాటి విషయాల మీద ఉపన్యాసం ఇవ్వబోయాను. ఐస్‌క్రీమ్ అప్పుడే బేరర్ తేవడం వల్ల ఆగాను.

వాడు అటు వెళ్ళగానే, రాజ్యం- "నిజం చెప్పండి!" అంది, రానున్న తుఫాను సూచించే తడిగొంతుకతో, ఎర్రబారిన కళ్ళతో.

ఆ క్షణంలో నా అభిమానం దెబ్బతిన్నది. ఒక నిశ్చయానికి వచ్చాను.

"నిజం కావాలా, రాజ్యం?" అన్నాను.

ఆమె తల ఊపింది, ఐస్‌క్రీమ్ చప్పరిస్తూ.

"ఆ అమ్మాయి నిజం పేరు గ్రేస్. ఒకప్పుడు చాలా దగ్గరగా ఉండేవాళ్ళం."

తినడం ఆపి, నా కళ్ళలోకి చూసి, తల దించుకుంది రాజ్యం.

"నిజానికి ఆమెతో సంవత్సరం గడిపాను....

రాజ్యం ఐస్‌క్రీమ్ మీద దృష్టి కేంద్రీకరించి, "మీ చెవిలో ఏం చెప్పింది" అంది, గాద్గదికంగా.

"నా కోసం ఎదురుచూస్తోందిట" అన్నాను.

కోపంగా మాట్లాడుతున్నాను.

రాజ్యం జాలిగా ఒకసారి నా వైపు చూసి, మిగిలిన టేబిల్స్‌వైపు ఒకసారి పర్యావలోకనం చేసి, నాకులాగే అనుభవాలని పంచుతూన్న కాబరే గర్ల్ మీద దృష్టిని నిలిపింది. ఖాళీ అయిన ఐస్‌క్రీమ్ ప్లేట్లు తీసి, కాఫీ తెచ్చి ఇచ్చాడు బేరర్. కాఫీ కలుపుతూ నా ఆలోచనలో నేను ఉన్నాను. రాజ్యం ఇంత అనుమానపు మనిషి అనీ, ఇంత మూర్ఖంగా ఉంటుందనీ నాకు తెలియడం అదే మొదటిసారి. ఈ ఊరిలో నా పూర్వాశ్రమపు 'గర్ల్ ఫ్రెండ్స్' చాలా మంది ఉన్నారు. ఈ రకం మనస్తత్వం మారకపోతే రాజ్యం గులాబికన్నా ముళ్ళే ఎక్కువగా చూపెడుతుంది. ఇలాటి రకరకాల భావాలు, ఎక్కువ పాలు కోపం నా దృష్టిని కాఫీమీద కేంద్రీకరింప జేశాయి.

"అటు చూడండీ...." అంది నవ్వుతూన్న గొంతుకతో, రాజ్యం.

కొంచెం ఆశ్చర్యంగా ఆమె ముఖంలోకి చూశాను. నిజంగానే ఆమె ముఖం మీద చిరునవ్వు.

'అటు' చూశాను.

నాట్యం చేస్తూ కాబరే గర్ల్ ఒక వృద్ధుడితో ఆడుకుంటూంది. అతని ఒళ్ళో కూర్చుని, మెడచుట్టూ చేతులు వేసి, ముఖంమీద ముఖంపెట్టి, కదులుతూ, చెవిలో ఏదో చెబుతూ ఆడుతూంది. నా కళ్ళజోడు ఆమె చేతిలో ఉంది.

"నాతో అబద్ధం ఎందుకు చెప్పారు?" అంది రాజ్యం, కాఫీ కప్పు తీసుకుంటూ.

నేనేం జవాబు చెప్పలేదు.

రాజ్యం కళ్ళు అటే ఉన్నాయి. మరో టేబిల్ దగ్గర కాబరే గర్ల్ వినోదం కలుగజేస్తూంది. అక్కడి నించి మరొక టేబిల్, మరొక మనిషి.

"లేనివి కల్పించడం ఎందుకు ?"

ఒక్కసారి నవ్వాను నేను ఈ పరిస్థితికి. నా నవ్వుని అపార్థం చేసుకుంది కాబోలు, రాజ్యం కూడా నాతో నవ్వింది.

మళ్ళీ ఆ అమ్మాయి ఇటు వస్తూంది.

"లేనివని నీ కెలాగ తెలుసు ?" అన్నాను.

ఆమె జవాబు చెప్పేలోగా నా కళ్ళజోడు నాకు పెట్టి, డాన్సు చేస్తూనే నా బుగ్గలు నిమిరి, కాబరే గర్ల్ రాజ్యం మెడలోని నెక్లేస్ వేళ్ళలోకి తీసుకుని, "బ్యూటిఫుల్" అంది.

చిరునవ్వుతో, "యూ వార్ బ్యూటిఫుల్" అంది రాజ్యం.

ధన్యవాదాలు చెప్పి, మా ఇద్దరికీ ఒక చిరునవ్వు ఇచ్చి ఆమె సాగిపోయింది.

"ఇంకా ఋజువు కావాలా?" అంది రాజ్యం.

"వద్దు" అన్నాను లేస్తూ.

"అప్పుడే వెళ్లడమా?" అంది రాజ్యం. కూర్చునే.

చివరిదాకా ఉన్నాము. ఒంటిగంట దాటాక ఇంటికి చేరాము. అలస్యంగా నిద్రపోయేదాకా ఆమె నా ప్రవర్తన మీద నవ్వుతో వ్యాఖ్యలు చేస్తూనే ఉంది.

నే నట్టే బాధపడలేదు. నాకు హోటల్లో కోపం వచ్చిన మాట నిజం. కాని, ఆ విషయం ఆమె గమనించనేలేదు. చాలా కారణాలవల్ల ఇదే మంచిదనిపించింది. ఆ విషమ పరిస్థితి అలాగ గడిచిపోయింది. సత్యమే జయించింది.

రెండు, మూడు వారాల తరవాత ఈ ఉదంతం మే మిద్దరమూ మరిచి పోయాము. ఒక సాయంత్రం నేను స్నానంచేసి బట్టలు మార్చుకుని వచ్చే సరికి, టెలిఫోన్ పక్కన స్తంభించిపోయినట్టు నిలబడిఉంది రాజ్యం.

సముద్రపు గాలి శుభ్రపడిన శరీరాన్ని తాకి, చాలా సుఖంగా ఉంది. మా ఇంటి ముందునించి ప్రతి నిమిషం పదినించి పాతికకార్లూ, లారీలూ, ఇతర వాహనాలూ పూర్తి వేగంతో సాగిపోతూ ఉంటాయి. ఇవన్నీ వాటి ఎగ్జాస్టుల పొగతో గాలిని కలుషితం చేసి, భరించరానిదిగా చేస్తూ ఉంటాయి. కాని, మా ఫ్లాట్ నాలుగో అంతస్తులో ఉండడం వల్ల, ఈ పరిస్థితికి అలవాటు పడిపోవడంవల్ల అంతగా గమనించము.

"ఏమి టలాగ నిలబడిపోయావు ?" అన్నాను, కాఫీ తీసుకుంటూ.

ఆమె మాట్లాడకపోతే అటు చూశాను. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. ఇది కోపమో, దుఃఖమోనని అంచనాలు వేసేలోపునే అది కోపం అని తెలిసి పోయింది.

"ఏమిటి, రాజ్యం ?" అన్నాను భుజంమీద చెయ్యివేస్తూ. ఎలకని తీసినట్టు తీసి తోసేసింది నా చేతిని.

ఇలాటి ప్రవర్తనకి రెండే రెండు రకాల ప్రతీకారం ఉంది. ఒకటవది- నాకూ కోపం వచ్చి నాలుగు రానివ్వడం, అవసరమైతే చెయ్యి చేసుకోవడం. కాని నాగరికుణ్ణి కావడంవల్లా, సంస్కృతి ఉన్న మనిషిని కావడంవల్లా ఇది సాధ్యం కాలేదు. అదీకాక రాజ్యం ప్రత్యేక పరిస్థితులు ఉండనే ఉన్నాయి- నా దృష్టిలో ముఖ్యం కాకపోయినా!

అందుచేత రెండో మార్గం- నిశ్శబ్దం- అవలంబించాను.

ఇది రెండు నిమిషాల్లో పనిచేసింది.

"మీ ప్రేయసి వస్తోంది" అంది రాజ్యం.

బలవంతాన నవ్వు తెచ్చుకుని, "అలాగా ?" అన్నాను.

"ఆఁ. పేరు తార- ఢిల్లీ నించి ఈ ఉదయమే వచ్చిందిట...."

గుండె ఝల్లుమంది. తార మరీ దూరంగా ఉండిపోయిన అమ్మాయి కాదు. ఒకప్పుడు పెళ్లిదాకా వచ్చింది పరిస్థితి. ఆ అమ్మాయికి స్కాలర్‌షిప్ వచ్చి, ఆమె అమెరికా వెళ్లి ఉండడంవల్ల కాకపోతే ఫలితాలు వేరుగా ఉండేవి.

"ఎవ రావిడ ?" అంది రాజ్యం, నా నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ.

"రెండేళ్ల క్రిందట తెలుసులే" అన్నాను.

"ఎంత బాగా ?"

"ఏం ?"

"చాలా అధికారంగా ఏడు గంటలకి వస్తాననీ, మీరు మామూలు చోట కలుసుకోకపోతే ఇక్కడికి వస్తాననీ చెప్పమంది- అందుకు...."

"బాగానే తెలుసు- స్నేహితురాలు...."

రాజ్యం 'ఇంకా చాల' దన్నట్టు పరికించి చూస్తూంది.

"కలిసి తెగ తిరిగేవాళ్లం....రాత్రిళ్లు అలస్యంగా...."

"మరి ?"

"పెళ్లి చేసుకుందా మనుకున్నాము."

"ఆ 'మామూలు చోటు' ఎక్కడ ?"

"రీగల్ ముందు. ఆవిడ హాలిడే కాంపు దగ్గర ఉంటుంది...."

"ప్రేమించుకున్నా రన్నమాట."

"అవును."

"గాఢంగా-"

"అవును."

"మరి? ఎందు కాగిపోయారు?"

"ఆమె అమెరికా వెళ్లిపోయింది."

"ఉత్తరాలు రాసేదా?"

"ఆఁ...."

"ఏవీ?"

"ఉంచలేదు- ఆఫీసులోనే దహనం చేశాను."

"మన మాట రాయలేదా?"

"లేదు- ఆ తరవాత ఉత్తరం రాయలేదు."

"ఎక్కడ తిరిగేవారు మీ రిద్దరూ?"

"చాలా చోట్ల..."

"మీ గదికి వచ్చేదా?"

"ఆఁ...."

"తరుచు."

"అవును."

"మీ రిద్దరూ..."

ఆమె అనుమానం అర్థమైంది. అనేక కారణాలవల్ల నేను నిజం చెప్పక పోవలసింది కాని, "అవును" అన్నాను.

"ఇంత పాడు మనుషు లనుకోలేదు" అంది, ప్రచండమైన కోపంతో రాజ్యం.

బెల్ మధురంగా మోగింది.

తార రానే వచ్చింది. క్షణమాత్రం బిత్తరపోయాను. అంతా మారిపోయింది. తల కత్తిరించింది. బెల్‌బాటమ్స్, కమీజు.

నేను తలుపు తియ్యగానే నన్ను కౌగలించుకోబోయింది. నేర్పుగా తప్పించు కుని, "లోపలికి రా.... శ్రీమతి ఎదురుచూస్తూంది" అన్నాను.

కళ్లు పెద్దవిచేసి, "గాడ్! నీ లేండ్ లేడీ అనుకున్నాను" అంది తార నెమ్మదిగా.

అదీ నిజమేనని చెప్పలేదు నేను.

లోపలికి తీసుకెళ్లి రాజ్యాన్నీ, తారని పరిచయం చేశాను.

తార ముందుగా క్షమాపణ చెప్పింది. "ఇతను పేయింగ్ గెస్టుగా ఉండేవాడు. డైరెక్టరీలో అడ్రస్ చూసి, ఇక్కడికి మారాడనుకున్నాను....మీకు కోపం వచ్చి ఉంటుంది" అంది తార.

"పొరపాట్లు జరుగుతూనే ఉంటాయి" అంది రాజ్యం కొంచెం కరిగి.

"ఆ రోజుల్లో మంచి ఫ్రెండు మీ ఆయన.... ప్రతి రోజూ మా ఇంటికి వచ్చి నాన్నగారితోనూ, నాతోనూ కబుర్లు చెప్పేవాడు" అంది తార.

"అలాగా!" అంది రాజ్యం.

"అర్జెంటుగా మద్రాసు వెళ్ళాలి. ఐ. ఎ. సి. వాళ్ళు టికెట్ ఇవ్వడంలేదు. ఈయనకి చాలా మంది తెలిసినవాళ్ళున్నారు.... తీసుకెళ్ళి ఏర్పాటు చేయిద్దామనుకుని వచ్చాను. మీ పరిచయం అయింది. చాలా సంతోషం" అంది చాలా సిన్సియర్‌గా తార.

రాజ్యం పూర్తిగా కరిగిపోయింది. కత్తుల్లాంటి కళ్ళతో నావైపు చూసి, "మీరు వెళ్ళి ఆమె టికెట్ తెండి.... ఆమె నెందుకు బాధపెట్టడం?" అంది.

టెలిఫోన్ మీద పనిఅయిపోతుందని చెప్పడానికి పరిస్థితులు సరిగా లేవు. నేను వెళ్ళి పని ముగించుకుని, నా స్నేహితుడితో ఒకటి రెండు చోట్ల తిరిగి, తొమ్మిది దాటాక వచ్చాను. తార రాజ్యంతో అత్యనురక్తితో మాట్లాడుతూంది.

నా రాకని గమనించడం కాని, టికెట్ మాట అడగడం గాని ఎవ్వరూ పట్టించుకోలేదు. పది దాటాక బాల్కనీలో కూర్చుని మెరీన్ డ్రైవ్ అందాన్ని పరీక్షిస్తున్న నాకు భోజనానికి ఆహ్వానం వచ్చింది. తరవాత గంటసేపటిలోనూ తినడానికి తప్ప నోరు తెరిచే అవసరం లేకపోయింది నాకు. తారని ఇంటి దగ్గర వదిలి నేనూ, రాజ్యం తిరిగి వచ్చేసరికి పన్నెండు దాటింది.

ఇంట్లో అడుగుపెట్టేసరికి రాజ్యం, "తారని గురించి ఎందుకన్ని అబద్ధాలు చెప్పారు?" అంటూ మొదలుపెట్టింది.

నే నేం అనలేదు.

"అప్పుడూ ఇలాగే అబద్ధాలు చెప్పేవారట.... తార అన్నీ చెప్పింది...." అంది రాజ్యం.

నే నేం అనలేదు. అగ్నిసాక్షిగా పెళ్ళాడి, ఆమెతో ఇంతకాలం నుంచి జీవితం గడుపుతూన్న నేను చెప్పిన నిజం కాదని ఆ సాయంత్రం కలిసి, బహుశా జీవితంలో మళ్ళీ కలియకుండా విడిపోయిన తార చెప్పిన అబద్ధాలు నిజంగా స్వీకరించిన రాజ్యానికి ఏం చెప్పేది?

పది నిమిషాల్లో నిద్రకి ఉపక్రమించాను. రాజ్యం తెగ నవ్వుతూంది. తార నాలో విచిత్రమైన అశాంతి కలగజేసింది. చిరాగ్గా, "ఎందుకా నవ్వు?" అన్నాను.

"మిమ్మల్ని చూసి....కలలో రామాన్ని ఎక్కువ మీకు!" అంది రాజ్యం.

దీపం తీసేశాను. కలలో రాజ్యం నవ్వుతూనే ఉంది. సరిగా నిద్ర పట్టలేదు. ఈసారి సత్యం జయించిందో, లేదో తెలియలేదు.

ఆ తరవాత వాళ్ళ నాన్నగారికి ఒంట్లో బాగులేదని రాజ్యం పుట్టింటికి వెళ్ళింది. ఎయిర్ పోర్ట్‌లో చివరి మాటలుగా, "చూడండి! నేను వచ్చేదాకా బుద్ధిగా ఉండండి!" అంది నవ్వుతూ.

ఆమె వెళ్ళిపోయాక నేను తిన్నగా ప్రవర్తించేందుకు చాలా నిర్ణయాలు తీసుకున్నాను. ముఖ్యంగా, నైట్ క్లబ్‌కి దూరంగా ఉండటం, అన్ని రకాల అమ్మాయిలనీ దూరంగా ఉంచడం.

సాయంత్రాలు గడపడం కష్టం అయిపోయింది. చాలాసార్లు రాజ్యం ఉంటే బాగుండుననిపించింది, మొదటి వారంలోనే. ఆ రోజు మబ్బులు పట్టి విచిత్రమైన ఒంటరితనం బాధించింది.

అందుకే ఆ సాయంత్రం రీగల్‌కి వెళ్ళాను, చాలా మంచి పిక్చర్ ఉందని— టికెట్లు లేవు. పెద్ద 'హౌస్‌ఫుల్' బోర్డు మెట్లదగ్గిరే ఎదురుపడింది.

ఎవరైనా టికెట్లు అమ్ముతారని కొంచెంసేపు నిలబడ్డాను. హఠాత్తుగా వర్షం ఆరంభం అయింది.

ఏం చెయ్యడమా అని ఆలోచిస్తూంటే, ఒక మూల ఒదిగి నిలబడి దారి తప్పినట్టు చుట్టూ చూస్తూన్న ఆ అమ్మాయి కనిపించింది. చేతిలో టికెట్టు కనిపిస్తూనే ఉంది.

ఆశగా నా వైపూ, కుండపోతగా పడుతూన్న వర్షం వైపూ చూసి, అనుమానంగా, "టికెట్ కావాలా?" అంది.

"అవును" అన్నాను.


ఆమె దగ్గర డ్రెస్ సర్కిల్ రెండు టికెట్లు ఉన్నాయి. ఒకటి నా కిస్తూ, "నా ఫ్రెండ్ వస్తానని రాలేదు— ఇంక రాదు" అంది.

నేను అయిదు రూపాయల నోటు తీసి ఇవ్వబోయాను. ఆమె వారిస్తూ, "ఏభై పైసలు లేవు నా దగ్గర" అంది.

బుకింగ్ ఆఫీసు వైపు అడుగువేశాను.

"ప్లీజ్! మరిచిపోండి" అంది ప్రార్థనగా.

చాలా అందం, సంస్కారం ఉన్న అమ్మాయిలాగ ఉంది. ఈ పట్టణంలో ఇంతకన్నా అందం, సంస్కారం ఉట్టిపడే అమ్మాయిలు నాకు తెలుసు. వాళ్ళ ప్రవర్తనలూ తెలుసు. అందుకే తటపటాయించాను.




కాని, ఆమెలో ఏదో గౌరవించదగినది కనిపించి, క్షణంలో నా అనుమానాలని వదిలేసి, "థాంక్స్! రండి" అని ఆమెతో మీదికి వెళ్లాను. ఇంకా ఇంట ర్వెల్ అవలేదు. పిక్చర్ కి కనీసం పది నిమిషాల వ్యవధి ఉంది. వెళ్లి ఐస్‌క్రీమ్ తిన్నాము. ఆమె తనని గురించి చెప్పింది.

ఆమె పేరు అనుపమ. కలకత్తానించి వచ్చింది – నెల రోజులపాటు ఇక్కడ యూనివర్సిటీలో రిసెర్చి సంబంధంగా కొన్ని నేర్చుకునేందుకు. బొరివిలిలో ఒక స్నేహితురాలితో ఉంటుంది.

నా సంగతులూ అడిగింది. అన్నీ చెప్పాను— ఉద్యోగం, భార్య, ఇల్లు.

"అదృష్టవంతులు మీరు!" అంది.

"అవును" అన్నాను కొంచెం ఆలోచించి.

సినీమా ముగిసేసరికి వర్షం ఇంకా జోరుగా పడుతూంది.

"పదండి. భోజనం చేశాక వెడుదురుగాని" అన్నాను.

"లేదండీ! నా ఫ్రెండ్ ఎదురుచూస్తూ ఉంటుంది. మీకు అసౌకర్యం కాకపోతే చర్చ్‌గేట్‌లో డ్రాప్ చెయ్యండి" అంది.

"ఈ వర్షంలో ఎలాగ వెడతారు?"

"అక్కడ దిగాక టాక్సీ దొరుకుతుంది."

స్టేషన్‌కి వెళ్లాము. కొంచెం తడిసి లోపలికి చేరగానే అంతా నిర్మానుష్యంగా కనిపించింది.

బుకింగ్ కిటికీ దగ్గర నోటీసు....! రైళ్లన్నీ నిలిపివేశారు.

"ఎలాగ ?" అంది అనుపమ.

"మరో గంటలో ప్రారంభిస్తారు.... మా ఇంటికి రండి" అన్నాను.

ఒక్కసారిగా అలసట వచ్చింది ఆమెకి.

"మీకు బాధ కలిగించడంకన్న గత్యంతరం లేదు.... ఇక్కడ వెయిటింగ్ రూమ్ కూడా లేదు" అంది అనుపమ.

కారులో కూర్చునేసరికి మళ్లీ కొంచెం తడిశాము. నాలుగైదు నిమిషాల్లో ఇంటికి చేరాము.

ఆమెకి బాత్‌రూమూ, బెడ్‌రూమూ చూపెట్టి, "ఆ చీర ఆరవెయ్యండి.... మా ఆవిడ బట్టల్లోంచి కావలసినవి తీసుకోండి" అన్నాను.

ఆమె తల ఊపి, తలుపు వేసుకుంది. ఆమె వచ్చేలోగా భోజనానికి ఏర్పాట్లు చేశాను.

రాజ్యం చీర కట్టుకుంది అనుపమ. భోజనం దగ్గర కూర్చుని, "థాంక్స్.... నాకు జలుబు మరీ ఎక్కువ. మీ అవసరం లేకపోతే ఏమయ్యేదాన్నో !" అంది అనుపమ.

ఈ రకం కృతజ్ఞతా భావాల ప్రదర్శన ఈ సమాజంలో చాలా కృత్రిమంగా ఉంటుంది. కాని, అనుపమ ఎంతో మనసారా అంది ఆ మాటలు.

భోజనాలయాక ఆమె స్టేషనుకి టెలిఫోన్ చేసింది. రాత్రి రైళ్లు వెళ్ళే సూచన లేదని తెలిసింది.

"టాక్సీ వస్తుందేమో !" అంది బెంగగా అనుపమ.

"ఈ రాత్రి ఇక్కడ ఉండిపోండి. ఉదయం వెళ్లవచ్చును" అన్నాను.

కాని, స్నేహితురాలి ఆత్రత గురించి ఆత్రత అనుపమకి. ఆటోమొబైల్ అసోసియేషన్‌కి ఫోన్ చేశాను. చాలా చోట్ల రోడ్డు నీటికింద ఉందనీ, ప్రయాణం మంచిది కాదనీ చెప్పారు.

చేసేదిలేక ఆ రాత్రి అనుపమ అక్కడే నిద్రపోయింది. ఉదయం కాఫీ తాగి వెళ్లిపోయింది.

అలాగ పరిచయం అయింది ఆమె. నాలో విచిత్రమైన అభిమానం ఆమె మీద ఏర్పడింది. కల్మషం లేని స్నేహంలో ఎంత ఆనందం ఉందో ఆమె నాకు ఋజువు చేసింది.

మొదటి సమాగమంలో కలిగిన ఈ భావనలు ఆమెని చాలాసార్లు కలుసుకున్న తరవాత ఇంకా దృఢం అయాయి. ఆమె భారత సంస్కృతి మీదా, ఆర్థిక వ్యవస్థ మీదా వాదన చెయ్యడం నాకు చాలా విషయాలు నేర్పింది.

రెండు వారాల తరవాత అనుపమ కలకత్తా వెళ్ళిపోయింది. ఎయిర్‌పోర్ట్‌లో గాద్గదికంగా నాకు ధన్యవాదాలు చెప్పి, నా శ్రీమతికీ చెప్పమంది. ఆమె వెళ్ళిపోయాక నా జీవితంలో పెద్ద లోటు కనిపించింది. ఒక చక్కటి అమ్మాయి విచిత్రమైన స్నేహబంధంలో నన్ను పెట్టడం ఇదే మొదటిసారి. ఆమెతో గడిపిన సంధ్యాకాలం గడియలు చాలా విలువైన జ్ఞాపకాలుగా, చక్కటి అనుభవాలుగా చాలాకాలం ఉంచుకుంటానని తెలుసును.

రెండు రోజులు పోయాక హఠాత్తుగా వచ్చింది రాజ్యం, తన టెలిగ్రామ్ కన్న ముందుగా.

"నాన్నగారికి బాగుంది.... వచ్చెయ్యాలనిపించింది" అంది రాజ్యం.

"మంచి పని చేశావు" అన్నాను హృదయపూర్వకంగా.

"బుద్ధిగా ఉన్నారా ఈ నెల రోజులూ?" అంది రాజ్యం.

ఆమెకి అనుపమని గురించీ, ఆమె ప్రత్యేకత గురించీ చెప్పాలనిపించింది. మరెవరైనా అపార్థంతో ఈ ఉదంతం రాజ్యానికి చెప్పవచ్చు. పరిస్థితి విషమిస్తుంది.

అందుకే నేనే చెప్పాను.

అంతా.

ఒక్క సంగతి విడవకుండా.

అంతా విని రాజ్యం మాట్లాడలేదు. బహుశా నాలాగనే అనుపమ అసామాన్యత్వాన్ని తలుచుకుని ఆలోచిస్తూందని అనుకున్నాను.

చివరికి, "మీరు మారరు!...." అంది రాజ్యం.

ఆమె కంఠస్వరానికి ఆశ్చర్యపడి, "ఏమిటి, రాజ్యం, నువ్వనేది?" అన్నాను.

ఆమె సమాధానం నాలో ఏ అనుమానాన్నీ విడవలేదు. అనుపమ రాకపోకలని ఆమె పూర్తిగా అపార్థం చేసుకుంది! పవిత్రమైన మా స్నేహాన్ని!

"మగవాళ్లంతా అంతే! మీరెప్పుడూ అంతే! నన్నలాగ వెళ్లనిచ్చి...."

"కాని, రాజ్యం!" అన్నాను నీరసంగా.

"మీకు నిజం చెప్పడం ఈ జన్మకి రాదు, పాడు మనుషులు!" అని గట్టిగా తలుపువేసుకుంది రాజ్యం.

బయట వర్షం పడుతూంది. నాలో భరించలేని వేడి.

రాజ్యం ఎప్పుడో తన గది తలుపు తీస్తుంది.

కాని, ఆమె తియ్యలేని తలుపులు మూసే ఉండిపోతాయి. ఏం చెయ్యను నేను?

———